కార్మికుల హక్కులను కాపాడుతాం..

ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

మాట్లాడుతున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మికుల హక్కులను కాపాడేలా కృషి చేస్తామని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని కోయగూడెం ఉపరితల గనిలో ఆదివారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఫిట్ సెక్రెటరీ రాకం అశోక్ అధ్యక్షతన జరిగిన కేవోసీ ఫిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి కంపెనీకి వచ్చిన లాభాలా వాటా నుంచి పర్మినెంట్ కార్మికులకు 33శాతం వాటాను శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు. సింగరేణి చరిత్రలోనే తొలిసారి సింగరేణి పరిధిలో పనిచేస్తున్న 25 వేల మందికి ఒక్కొక్క కాంట్రాక్ట్ కార్మికుడికి 5వేల చొప్పున ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని అన్నారు. కార్మికులకు రావాల్సిన న్యాయ పరమైన అన్ని సదుపాయాలు కార్మికుల సంక్షేమం కోసం ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి కాంగ్రెస్ పార్టీ ఉందన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ జె.వెంకటేశ్వర్లు, నాయకులు కోరం సురేందర్, బ్రాంచ్ సెక్రెటరీ భూక్యా నాగేశ్వరరావు, లావూడ్యా ఈర్యి, కంకిపాటి రామారావు, రాములు, బాసు, నవీన్, బాబురావు, శంకర్, సత్యనారాయణ, మంగీలాల్, రెడ్యానాయక్, పోశాలు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 22: ఏజెన్సీ మండల కేంద్రమైన లక్ష్మీనగరంతో పాటు మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటపాటు ఏకధాటిగా వర్షం కురవడంతో రోడ్లపైకి వరదనీరు వచ్చి చేరింది. రైతులకు ఈ వర్షం కొంత ఉపశమనం కలిగించింది.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

పాల్వంచ రూరల్; సెప్టెంబర్ 22: పట్టణంలోని ముర్రేడు వాగు నుంచి ఆదివారం ఇసుకను అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రెండు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి తహసీల్ కార్యాలయానికి తరలించారు. కేసు నమోదైంది.

పూర్వ విద్యార్థుల కలయిక

పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

చంద్రుగొండ, సెప్టెంబర్ 22: 2007 రేపల్లెవాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒకే చోట కలుసుకున్నారు. నాటి గురువులు(ఉపాధ్యాయులు) కలిసి సన్మానించి రోజంతా ఉల్లాసంగా గడిపారు. ప్రస్తుతం తాము చేస్తున్న వృత్తి, స్థిరపడిన రంగాన్ని గురువులకు తెలియజేసి, వారి ఆశీస్సులు పొందారు. ప్రతి ఏడాది సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వరిలో ఎండాకు తెగులు.. అన్నదాత దిగులు

రుణమాఫీ ఆన్‌లైన్‌లో వ్యవసాయ అధికారులు
రైతు వేదికలకు రాని విస్తరణాధికారులు
ఆందోళన చెందుతున్న అన్నదాతలు

ఎండాకు తెగులు సోకిన వరిపంట

తాళం వేసి ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం

దుమ్ముగూడెం, సెప్టెంబర్ 22: మండలంలో వరి పొట్టదశకు చేరుకోవడంతో ఎండాకు తెగులు సోకుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు ప్రభుత్వ రుణమాఫీ ప్రకటించిన సమయం నుంచి రుణమాఫీపై రైతులకు సంబంధించి ఫ్యామిలీ గ్రూపింగ్ ఆన్‌లైన్ నమోదులో బిజీగా ఉన్నారు. మండలంలో నర్సాపురం, గంగోలు, పెద్దనల్లబెల్లి, మహాదేవపురం, లచ్చిగూడెం గ్రామాల్లో రైతువేదికలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఈ రైతువేదికల ద్వారా గ్రామాల్లో రైతులు వ్యవసాయానికి సంబంధించి సూచనలు, సలహాలు తీసుకునేవారు. నెల రోజుల నుంచి రుణమాఫీ ప్రక్రియలో వ్యవసాయ అధికారులు, విస్తరణాధికారులు బిజీగా ఉండడంతో రైతువేదికల వద్ద ఎవరూ లేకపోవడంతో అన్నదాతలు పంటల సాగుకు సంబంధించి వివరాలు తెలుసుకునేందుకు వచ్చినప్పటికీ ఎవరూ లేకపోవడంతో సతమతమవుతున్నారు. రైతువేదికల వద్ద కాకుండా వ్యవసాయ కార్యాలయం వద్దకు సమస్య తెలుసుకునేందుకు వెళ్లిన అన్నదాతలకు అక్కడ తాళం వేసి ఉండడంతో అన్నదాతకు ఏంచేయాలో తెలియక అర్థం కాని పరిస్థితి. ప్రస్తుతం వరి పొలాల్లో ఎండాకు తెగులు ఉధృతంగా ఉండడంతో అన్నదాతలు వివిధ రకాల మందులు పిచికారీ చేస్తున్నా తెగులు తగ్గడం లేదని వాపోతున్నారు. ఈ విషయం వ్యవసాయ విస్తరణాధికారులకు చెబుదామంటే రైతువేదికల్లో వారు లేకపోవడం.. రుణమాఫీ ప్రక్రియలో బిజీగా ఉండడంతో తమ పంటలను నష్టపోయే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 22 వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. నేటి నుంచి విస్తరణాధికారులకు క్రాప్ సర్వేను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో ఈ ఏడాది విస్తరణ అధికారులు రైతులకు అందుబాటులో ఉండరేమోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని రైతువేదికల్లో విస్తరణాధికారులు ఉండేలా చూడాలని అన్నదాతలు కోరుతున్నారు.

వ్యవసాయాధికారి ఏమన్నారంటే..

ఈ విషయమై మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా రెండు రోజుల పాటు రుణమాఫీకి సంబంధించి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతుంది. బిజీగా ఉంటామని చెప్పడంతో పాటు రైతుల ఎండాకు తెగులుకు ఇప్పుడున్న వాతావరణ పరిస్థితుల్లో నత్రజని ఎక్కువగా వాడొద్దని, పంట పొలాల్లో నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని చెప్పారు.

ఎన్నో మందులు పిచికారీ చేశా..

ఎండాకు తెగులు సోకడంతో నివారణ కోసం ఎన్నో మందులు పిచికారీ చేశా. అయినా తెగులు నివారణ కావడంలేదు. ఈ విషయంపై సంబంధిత వ్యవసాయ విస్తరణాధికారులను కలిసేందుకు రైతువేదికకు వెళ్తే అక్కడ తాళం వేసి ఉంది. ఇలానే కొనసాగితే పంట నష్టపోవాల్సి వస్తుంది. రైతులకు సూచనలు ఇవ్వాల్సిన అధికారులు రుణమాఫీ పేరుతో రైతువేదికకు తాళం వేసి వెళ్తే రైతుల గతి ఏమవ్వాలి.

– పసుపులేటి వెంకన్న, రైతు, సున్నంబట్టి

వరదలో చిక్కుకున్న కారు.. కాపాడిన గ్రామస్తులు

కారును వాగులో నుంచి బయటకు తీస్తున్న గ్రామస్తులు

టేకులపల్లి, సెప్టెంబర్ 22: వరదలో కారు కొట్టుకుపోతున్న కారును, అందులోని వారిని గ్రామస్తులు రక్షించిన ఘటన మండలంలోని తూర్పుగూడెంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సుజాతనగర్ మండలం సర్వారం గ్రామానికి చెందిన కొమరం బుచ్చయ్య తన కారులో సుజాతనగర్ స్టేషన్ బేతంపూడి, తూర్పుగూడెం మీదుగా టేకులపల్లి నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఆదివారం తెల్లవారుజాము బయలుదేరాడు. గత రాత్రి కురిసిన వర్షానికి తూర్పుగూడెం దగ్గర ఉన్న రాళ్ళవాగు వద్ద అండర్ బ్రిడ్జిపై వరద పారుతుంది. వరదను గమనించని బుచ్చయ్య కారులో వస్తుండగా వరదలో కారుతో సహా కొట్టుకుపోయి బ్రిడ్జి చివరన తట్టుబడింది. దగ్గరలో ఉన్న గ్రామస్తులు గమనించి వెంటనే కారును, దానిలో ఉన్న కొమరం బుచ్చయ్యను కాపాడారు. కొమరం బుచ్చయ్య గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపాడు.

బ్రహ్మంగారి వీధిలో తాగునీటి సమస్య పరిష్కారం

నల్లాలకు మరమ్మతులు చేసిన పంచాయతీ సిబ్బంది
'నమస్తే' కథనానికి స్పందన


నల్లాకు మరమ్మతులు చేస్తున్న పంచాయతీ సిబ్బంది


మరమ్మతుల అనంతరం వస్తున్న నీటిని చూపుతున్న గ్రామస్తుడు

దమ్మపేట, సెప్టెంబర్ 22: దమ్మపేట మండల కేంద్రంలోని బ్రహ్మంగారి వీధిలో తాగునీటి సమస్య పరిష్కారం అయ్యింది. కాలనీలో పది రోజులుగా మంచినీటి సమస్య ఉందని కాలనీవాసులు తెలపడంతో 'బ్రహ్మంగారి వీధిలో తాగునీటి కటకట' అనే శీర్షిక 'నమస్తే'లో కథనం వచ్చింది. ఈ కథనానికి స్పందించిన కార్యదర్శి ప్రవీణ్ తక్షణమే పంచాయతీ సిబ్బందిని పంపించి వీధిలో కుప్పాల కృష్ణ ఇంటి వద్ద పంచాయతీ ట్యాప్‌తో పాటు నీటి సమస్య ఉన్న ప్రదేశాల్లో పంచాయతీ ట్యాప్‌లకు సిబ్బందిచేత మరమ్మతులు చేయించారు. మంచినీటి సరఫరాను పునరుద్ధరించారు. పంచాయతీ సిబ్బంది మరమ్మతులు చేసి తాగునీటిని పునరుద్ధరించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

సింగరేణి : ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పాల్వంచ రూరల్ : పూర్వ విద్యార్థులు

భద్రాచలం : 1990-91 పూర్వ విద్యార్థులు

కొత్తగూడెం సింగరేణి, సెప్టెంబర్ 22: సింగరేణి కార్మిక ప్రాంతమైన రామవరంలోని మహేశ్వరి ట్యూటోరియల్ 1992-93 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు ఆదివారం రామవరంలోని హైస్కూల్‌లో ఆదివారం కలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు రాంమూర్తి-వెంకటలక్ష్మి దంపతులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం ఆటపాటలతో సందడి చేశారు. నాగశిరోమణి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో బాలరాజు, ఉమాకాంత్, పాషా, అబ్బాస్, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 22: పట్టణంలోని నవతా స్కూల్ 1992-93 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల కలయికకు పాల్వంచలోని కిన్నెరసాని రోడ్‌లోగల ఫంక్షన్ హాల్ వేదికైంది. 32 సంవత్సరాల తర్వాత కలుసుకున్న నాటి ఆ సహాధ్యాయులంతా ఒక్కసారిగా స్కూల్ పిల్లలుగా మారిపోయి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా గడిపారు. తమకు పాఠాలు బోధించిన గురువులు జానకిరామ్, జైనుల్లాబుదీద్దన్, శంకర్, ఇంతియాజ్ బేగం, శ్రీవాణి, మంగ, అంజలి, ఆంధ్రావాణిని సన్మానించారు. వారికి పాదాభివందనాలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. నాటి విద్యార్థులు దోమల ప్రవీణ్, కిరణ్, హరికృష్ణ, ఎం.ప్రవీణ్, సాయి శ్రీను, రమేష్, నారాయణ, మోహన్‌రావు, వీరయ్య, నరేందర్ రెడ్డి, కిషోర్, రత్నాజీ, జయప్రకాష్, రామకృష్ణ, తులసీరామ్, కవిత, లత, కృష్ణకుమారి, శైలజ, స్మిత, ఇందుశ్రీ, లక్ష్మి, విజయలక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం, సెప్టెంబర్ 22: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్‌లో అక్షయ ఫంక్షన్ హాల్‌లో కొర్రాజుల గుట్ట పాఠశాల(నన్నపనేని మోహన్ స్కూల్)లో 1990-91 టెన్త్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత ఒకేచోట కలుసుకున్నారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, ఏలూరు, భీమవరం, ఖమ్మం నగరాలకు చెందిన 100 మంది విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. 33 ఏళ్ల తర్వాత అందరూ కలుసుకుని నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో చీకట్ల శరత్‌బాబు, సిద్ధాంతపు వాసు, ఎర్రంశెట్టి పరశురాం, సత్యానంద్, డేగల కిరణ్‌కుమార్, రవి, కటారి కృష్ణారావు, బర్ల ప్రభాకర్, కడాలి నాగరాజు, కుంచాల సదానందం, కిలిమి రామ్మోహనరెడ్డి, శ్రీపాద పావని, గొవ్వాల కనకదుర్గ, సత్య అనంతలక్ష్మి, నీలిమ, రాజ్యలక్ష్మి, సూర్యప్రభ, స్వర్ణలత, లలిత, కనకశ్రీ, సరస్వతి, పద్మజ, ఒగ్గు సంపత్‌కుమారి, గంజి నాగవెంకటలక్ష్మి, రామలక్ష్మి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

బాధితులకు నిత్యావసరాలు, వంటపాత్రలు అందిస్తున్న మోరంపల్లిబంజర గ్రామస్తులు

సారపాక, సెప్టెంబర్ 22: మండల పరిధిలోని కృష్ణసాగర్ పంచాయతీ బత్తులనగర్‌లో సోడె వెంకటేష్, గోపమ్మకు చెందిన ఇల్లు శనివారం దగ్ధమై నిరాశ్రయులయ్యారు. విషయం తెలుసుకున్న మోరంపల్లిబంజర గ్రామస్తులు బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. ఆదివారం గ్రామానికి వెళ్లి బాధితులను పరామర్శించి నిత్యావసర సరుకులు, వంట సామగ్రి, దుస్తులు, దుప్పట్లు, కొంత నగదు అందించారు. పంచాయతీ కార్యదర్శి నాగిరెడ్డి ఇచ్చిన సమాచారంతో గ్రామస్తులు తమ ధాతృత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కైపు లక్ష్మీనారాయణరెడ్డి, సారెడ్డి దామోదర్‌రెడ్డి, సోము ఆదిరెడ్డి, జక్కిరెడ్డి మల్లారెడ్డి, బిజ్జం వెంకట్రామిరెడ్డి, గాదె నర్సిరెడ్డి, గోవిందు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సీపీఎం నాయకుల పరామర్శ

బత్తులనగర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన కుటుంబాన్ని సీపీఎం నాయకులు పరామర్శించారు. మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, నాయకులు గ్రామానికి వెళ్లి బాధితులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిరాశ్రయులైన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కనుల పండువగా రామయ్య కల్యాణం

కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, సెప్టెంబర్ 22: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అర్చకులు అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణపుష్పాలతో అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పాల్గొన్న భక్తులు మురిసిపోయారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణమూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు ఐటీడీఏలో గిరిజన దర్బార్

భద్రాచలం, సెప్టెంబరు 22: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గిరిజన దర్బార్ 10.30 గంటలకు ఐటీడీఏ సమావేశ మందిరంలో జరుగుతుందని, అన్నిశాఖల ఐటీడీఏ యూనిట్ అధికారులు సకాలంలో హాజరుకావాలని పేర్కొన్నారు. గిరిజనులు వారి సమస్యలకు సంబంధించి అంశాలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందజేయాలని కోరారు.

నేడు మండలంలో ఎమ్మెల్యే పర్యటన

సారపాక, సెప్టెంబర్ 22: బూర్గంపహాడ్ మండలంలో సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పలు అభివృద్ధి పనులు ప్రారంభిస్తారని ఎంపీడీవో జమలారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మోతే, ఇరవెండి, తాళ్లగొమ్మూరు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని, మండలంలోని పంచాయతీరాజ్ అధికారులతో పాటు ఇతర శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

పినపాక తహసీల్దార్‌గా అద్దంకి నరేశ్

పినపాక, సెప్టెంబర్ 22: మండల తహసీల్దార్‌గా భద్రాచలం ఐటీడీఏ ఏపీవోగా విధులు నిర్వహిస్తున్న అద్దంకి నరేశ్‌ను నియమించారు. ఈ మేరకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన తోట సూర్యనారాయణ బదిలీ అయ్యారు. కాగా సూర్యనారాయణకు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా సమ్మయ్య గౌడ్

పినపాక(కరకగూడెం) సెప్టెంబర్ 22: కరకగూడెం గౌడ సంఘం అధ్యక్షుడిగా వీరగాని సమ్మయ్య గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం జై గౌడ్ సేన జాతీయ అధ్యక్షుడు మోర్ల ఏడుకొండలు గౌడ్ ఆదేశాల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బుర్ర సోమేశ్వర్ గౌడ్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వీరగాని సమ్మయ్య గౌడ్, ఉపాధ్యక్షుడిగా పూజారి ధనుంజయ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఎర్ర వెంకటేశ్వర్లు గౌడ్, సహాయ కార్యదర్శిగా పులి రవీందర్ గౌడ్, కోశాధికారిగా బెజవాడ రాములు గౌడ్, కార్యదర్శిగా తాళ్లపల్లి వెంకన్న గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా రావుల సమ్మయ్య గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అన్ని గ్రామాల గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

'వీరభద్రుని ఆలయ రక్షణకు చర్యలు తీసుకోవాలి'

ఆలయం వద్ద కోతకు గురైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సొసైటీ అధ్యక్షుడు బిక్కసాని

సారపాక, సెప్టెంబర్ 22: మోతే వీరభద్రుని ఆలయ రక్షణకు చర్యలు తీసుకోవాలని సొసైటీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు బిక్కసాని శ్రీనివాసరావు అధికారులను కోరారు. ఆదివారం మండల పరిధిలోని మోతే పట్టీనగర్‌లోని గోదావరి నదీ తీరంలో కొలువైన వీరభద్రుని ఆలయం చుట్టూ వరదలకు కోతకు గురైన విషయం పత్రికల్లో వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన పడవలో వెళ్లి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించి ఇటీవల వరదలకు ఆలయం చుట్టుపక్కల ప్రదేశాలు కోతకు గురయ్యాయని, ప్రతి ఏడాది మహాశివరాత్రి, ఇతర పండుగ సమయాల్లో భక్తులు వేలాదిగా ఈ ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటారని, ఆలయ విశిష్టతను కాపాడేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట గ్రామస్థులు, నాయకులు ఉన్నారు.

జనావాసాల్లోకి కొండచిలువ

కొండచిలువను పట్టుకున్న సంగయ్య

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబర్ 22: మండలంలోని లోతువాగు జనావాసాల్లోకి శనివారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో పదడుగుల కొండచిలువ వచ్చింది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో మున్సిపల్ స్నేక్ రెస్క్యూ టీం సభ్యుడు సంగయ్య వచ్చి, ఆ కొండచిలువను పట్టుకున్నారు. దానిని అడవిలోకి తీసుకెళ్లి వదిలేశారు.

నిత్యావసరాలు అందజేత

సరుకులు అందజేస్తున్న కొల్లు పద్మ

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ): దమ్మపేట మండలంలోని మూడు గిరిజన గ్రామాల(పూసుకుంట, చాతవాగు, కటుకూరు)కు చెందిన 24 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, సోలార్ లైట్లు, దోమ తెరలను హైదరాబాద్‌కు చెందిన ఎస్అండ్‌పీ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ కంపెనీ బృందం ఆదివారం అందజేసింది. ఎంపీటీసీ సభ్యుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షురాలు కొల్లు పద్మ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలి

రామవరం, సెప్టెంబర్ 22: సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికులందరికీ బోనస్ ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ డిమాండ్ చేశారు. రుద్రంపూర్‌లోని అంబేద్కర్ విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సింగరేణిలో 25వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నట్లుగా యాజమాన్యం ప్రకటించిందన్నారు. ఓసీలు, భూగర్భ గనులు, వర్క్‌షాప్, సీఎస్‌సీ, సివిల్ తదితర విభాగాల్లోని వారిని కూడా కలిపితే ఈ సంఖ్య దాదాపు 32వేలు ఉంటుందని డిమాండ్ చేశారు.

పరంజీపై నుంచి పడి తాపి మేస్త్రీ మృతి

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 22: తాపి పని చేస్తుండగా పరంజీ పైనుంచి జారి పడి తాపి మేస్త్రీ సోయం జానీ (47) మృతి చెందిన ఘటన మండల పరిధిలో రాచురుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సోయం జానీ అదే గ్రామంలో చర్చి భవన నిర్మాణ పని చేస్తున్నాడు. పనిలో భాగంగా పరంజీపై నిలబడి పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

కల్తీ లడ్డూ దోషులను శిక్షించాలి'

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 22: తిరుపతి లడ్డూను కల్తీ చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని మండలంలోని బోల్లోరిగూడెం రామాలయ పాలక మండలి అధ్యక్షుడు ఎస్వీఆర్కే ఆచార్యులు కోరారు. ప్రెస్ క్లబ్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలను పీఠాధిపతులకు, ధార్మిక సంస్థలకు అప్పగిస్తే ఇటువంటి సమస్యలు రావని అభిప్రాపయపడ్డారు. జిల్లా బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడు వింజమూరి వేణుకుమార్, కార్యదర్శి హరీష్, సభ్యులు వింజమూరి మురళీకుమార్, ఎస్పీ గోపాలాచార్యులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **సత్తుపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **చింథి సంధ్య** W/o: **చింథి వెంకటేశ్వర్లు, వయస్సు :**39సం॥లు, **వృత్తి:** గృహిణి, **నివాసం :** ఇ.నెం. 5-157, సంకేపేట దమ్మపేట గ్రామం మరియు మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నాక్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : జిల్లా రిజిస్ట్రారు మరియు జిలాల పరిషత్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండల పరిషత్తు, కొత్తగూడెం సబ్ రిజిష్ట్రారు వారి ఇలాఖా దమ్మపేట గ్రామపంచాయితీ దమ్మపేట గ్రామ రెవిన్యూ రికార్డు దాఖలా దమ్మపేట గ్రామంలో, కొత్తపేటలో 7-120వ నెంబరుగల ఇంటికి సమీపంలో ఉన్న ఖాళీ నివేశన స్థల సర్వే నెం. 589/1-ఆ1 మింజమురే, **డాక్యుమెంట్ నెం. 1246/2017, విస్తీర్ణము:** 360 చ॥గ॥ స్థలమునకు సరియగు 301 చ॥మీ॥ ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు :** గ్రామపంచాయితీ రోడ్డు ఆస్తి కొలత 42 అగుడులు, **దక్షిణము:** తిమ్మ రాజు నాగేశ్వరరావు గారి స్థలము ఆస్తి కొలత 77 అడుగులు, **పడమర:** గ్రామపంచాయితీ రోడ్డు ఆస్తి కొలత 42 అగుడులు, **ఉత్తరము :** గ్రామపంచాయితీ రోడ్డు ఆస్తి కొలత 77.5 అగుడులు,

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K.
9160900024 / 9640400073.
NT-331774-All

BUSINESS OFFER

★ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతినెలా ఆదాయం కావాలా? మీ దుకాణానికి ప్రచార ప్రకటనలు జోడించి ప్రతినెలా 7,000/- ఇస్తాము. Ph: 9948000371, 9948000373.
NT-338751-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల